
రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

# ఎన్నికలకు సహకరించాలి

■ ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగురూరల్, మే 21 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నెల 27న జరుగనున్నందున ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. జూన్ 5న కౌటింగ్ ఉంటుందని తెలిపారు. 52మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, సాధారణ ఎన్నికల్లా మాక్ పోలింగ్ ఉండదని, ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ బాక్స్ ఓపెన్ చేసి చూపించనున్నట్లు చెప్పారు. కోడ్ అమల్లో ఉన్నందున కులం, మతం ప్రాంతంపై విధ్వేషాలు పెంచేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమన్నారు. ఓటర్లను ప్రలోభాలు, వేధింపులకు గురి చేయడం, తప్పుడు ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 10,299మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 6,587 మంది పురుషులు, 3712మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్, డీటీ పాల్గొన్నారు.

**టీఎస్ స్థానంలో టీజీని వాడాలి**

టీఎస్ స్థానంలో టీజీని వాడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర అబ్రివేషన్‌ను సూచించే టీఎస్ స్థానంలో టీజీని వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దృష్ట్యా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు, వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ ఫ్లాట్‌పామ్ ఏదైనా కమ్యూనికేషన్ కోడ్ టీజీని వాడాలన్నారు.

**ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 వరకు ఉదయం 9 నుండి సాయంత్రం 5గంటల వరకు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

■ భూపాలపల్లి నియోజకవర్గంలో 16 పోలింగ్ కేంద్రాలు.. 12,535 మంది ఓటర్లు
■ 9 మంది పీవోలు, 19 మంది ఏపీవోలు
■ 23న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్న భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

జయశంకర్ భూపాలపల్లి, మే 21 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు భూపాలపల్లి నియోజకవర్గంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భూపాలపల్లి, చిట్యాల, గణపురం, మొగుళ్లపల్లి, రేగొండ, టేకుమట్ల, గోరికొత్తపల్లి మండలాల్లో మొత్తం 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బందిని సైతం నియమించారు. నియోజకవర్గంలో 12,535 మంది ఓటర్లు ఉన్నారు. 16 పోలింగ్ కేంద్రాల్లో 19 మంది పీవోలు, 19 మంది ఏపీవోలు, 38 మంది ఓపీవోలు విధులు నిర్వర్తించనున్నారు. మంగళవారం కలెక్టర్ భవేశ్‌మిశ్రా ఎన్నికల విధులపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. విధుల్లో ఉన్న వారు ఫాం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 23న కలెక్టరేట్‌లోని జీ5లోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

**16 పోలింగ్ కేంద్రాలు**

నియోజకవర్గంలో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఆవరేజిగా 779 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. భూపాలపల్లి మండలంలో ఆరు, చిట్యాలలో రెండు, గణపురంలో రెండు, మొగుళ్లపల్లిలో రెండు, రేగొండ మండలంలో రెండు, టేకుమట్లలో ఒకటి, గోరికొత్తపల్లి మండలంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్ని మండల కేంద్రాల్లోని జడ్పీహెచ్‌ఎస్‌ల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు. భూపాలపల్లిలో జడ్పీహెచ్‌ఎస్‌లో మూడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

**సిబ్బందికి శిక్షణ**

కలెక్టరేట్‌లో మంగళవారం నోడల్ అధికారులు, పోలీసులు, పీవో, ఏపీవో, ఓపీవో, రూట్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు కలెక్టర్ భవేశ్‌మిశ్రా శిక్షణ ఇచ్చారు. పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. బరిలో 52 మంది ఉన్నారని, ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 23న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్‌లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మారణాయుధాలు, వాటర్ తీసుకెళ్లకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారులు అవినాశ్, శామ్యూల్, ఆర్డీవో మంగీలాల్, డీఎస్పీ సంపత్‌రావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలి

**ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి**


మాట్లాడుతున్న ములుగు ఆర్డీవో

ములుగురూరల్, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌ను సమర్ధవంతంగా పూర్తిచేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియలో పీవోలు, ఏపీవోలు, ఓపీవోల పాత్ర కీలకంగా ఉంటుందని తెలిపారు. ఓటర్లు బ్యాలెట్‌తో ఓటు వేస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, సూపరింటెండెంట్, శివకుమార్, ఎలక్షన్ డీటీలు విజయ్, అనిస్ ఫాతిమా, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తుమ్మ మల్లారెడ్డి

## రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

ఏటూరునాగారం, మే 21 : పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మాయమాటలు చెప్పే చింతపండు నవీన్‌ను చిత్తుగా ఓడించాలని కోరారు. బ్లాక్ మెయిల్ దందా చేసి కోట్ల రూపాయలు సంపాదించిన నవీన్‌ను ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే రేవంత్‌రెడ్డితో కలిసి దోపిడీకి దిగుతాడని విమర్శించారు. పట్టభద్రులు ఆలోచించి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఖాజా పాషా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వావిలాల రాంబాబు, కుమ్మరి చంద్రబాబు, దన్నపనేని కిరణ్, ఎంపీటీసీ నర్సింహులు, నాగరాజు, జయకృష్ణ, శంకర్, రాంబాబు, దేవేందర్, సర్పంచ్ దొడ్డ కృష్ణ, మహేశ్వర్‌రావు, రాజేశ్, రాజు, కిశోర్, సుధాకర్, పాపారావు, నరేశ్, మనోజ్ పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ములుగురూరల్, మే 21 : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, నాయకులు చాంద్‌పాషా, బానోత్ రవిచందర్, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బాదం ప్రవీణ్, రవి, రఘు, అనిల్, ఓంప్రకాశ్, రాజు, రాజయ్య, కుద్బుద్దీన్, శంకర్, దేవయ్య, రామకృష్ణ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కుల సంఘం నూతన కమిటీ

గణపురం, మే 21 : మండలంలోని బుద్దారంలో ముదిరాజ్ కుల సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సుభాష్ ఆధ్వర్యంలో కుల పెద్ద మనుషులుగా నీరటి గున్ని, అచ్చునూరి రమేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం స్వామి, అచ్చునూరి సారంగపాణి, డైరెక్టర్ అచ్చునూరి సంపత్, కట్ల రాజు, కట్ల పవన్, మల్లవేణి రాంబాబు, సదయ్య, రమేశ్, ప్రశాంత్, పోశాలు, పెద్ద రమేశ్, మాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో జీలుగ విత్తనాలు

చిట్యాల, మే 21 : మండలంలోని రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం, గిద్దెముత్తారంలోని ఆగ్రోస్‌లో క్వింటాలు విత్తనాలకు సబ్సిడీ పోను రూ.3,720 చెల్లించి పొందవచ్చన్నారు. 30 కిలోల విత్తనాలు 2.5 ఎకరాలకు సరిపోతాయని, రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో చిట్యాల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించి జీలుగ విత్తనాలు పొందాలని శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

## 'సంఘమిత్ర' ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

భూపాలపల్లి రూరల్, మే 21 : చిట్యాల మండలంలోని చైన్‌పాకకు చెందిన రేణిగుంట సదానందం ఇటీవల మృతి చెందగా, మంగళవారం భూపాలపల్లి సంఘమిత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు గుర్రపు రవీందర్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదానందం కుమార్తె శ్రావ్య సంఘమిత్ర కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నదని, ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎలుగూరి హరికృష్ణ, అధ్యాపకులు మొగిలి, నరేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలి

కాటారం, మే 21 : మండలంలోని రేగులగూడెం శివారులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రచార కమిటీ కో-కన్వీనర్ మొగిలి రాజ్‌కుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రేగులగూడెం శివారులోని సర్వే నంబర్ 201లో ఉన్న 18 గుంటల ప్రభుత్వ భూమి బూడిదపల్లి ప్రాథమిక పాఠశాలకు కేటాయించారని, అన్యాక్రాంతం కాకుండా హద్దులు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు.


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

## లోడింగ్‌పనులు కల్పించాలి

వాజేడు, మే 21 : మండలంలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుల్లో లోడింగ్‌పనులు కల్పించాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు గుగ్గిళ్ల దేవయ్య, బచ్చల కృష్ణబాబు కోరారు. ఇప్పగూడెంలో మంగళవారం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇసుక ర్యాంపుల్లో భారీ యంత్రాలతో పనులను ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు చొరవ చూపి నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో మోడెం బాబురావు, రవీందర్, కారం సరస్వతి, నరేశ్, రమేశ్, జ్యోతి, పద్మ, సాయన్న, రవీందర్ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న శ్రీజ

## పాఠశాలల పనులు పూర్తి చేయాలి

**ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ**

కన్నాయిగూడెం, మే 21 : అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని ఏటూరు, సింగారం, కంతనపల్లి ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీఆర్ ఏఈఈ భిక్షపతిని ఆదేశించారు. మరుగుదొడ్లకు అమర్చిన తలుపులు సరిగాలేకపోవడంతో వాటిని సరిచేయాలన్నారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి వెంకటనారాయణ, ఎంపీడీవో వనిత, ఎంఈవో రాజేశ్, ఎంపీవో రామకృష్ణ ఉన్నారు.

## ఆరోగ్య మహిళ కేంద్రంలో వైద్య పరీక్షలు

వెంకటాపురం (నూగూరు), మే 21 : మండలంలోని ఎదిర ఆరోగ్య మహిళ కేంద్రంలో వైద్యురాలు భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం 74 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 12 మంది వద్ద నుంచి రక్త నమూనాలు సేకరించి ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యురాలు తెలిపారు.

# పరిశీలిస్తూ.. అధ్యయనం చేస్తూ..

■ భూపాలపల్లి జిల్లాలో రెండో రోజూ కేంద్ర బృందం క్షేత్ర పర్యటన


కాటారం : కంపోస్టు ఎరువు తయారీని పరిశీలిస్తున్న ఏఎస్‌వోలు

కాటారం/ గణపురం/ కాళేశ్వరం/ భూపాలపల్లి రూరల్, మే 21 : కేంద్ర అధికారుల బృందం జిల్లా పర్యటన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. పల్లె ప్రగతి పనులు, దవాఖానలు, ఉపాధి హామీ పనులు పరిశీలించి.. తమ అధ్యయనం కొనసాగించారు. కేంద్ర సచివాలయ ఏఎస్‌వోల బృందం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించేందుకు నాలుగు రోజుల అధ్యయనంలో భాగంగా రెండో రోజూ కాటారం మండలం గంగారం గ్రామ పంచాయతీని సందర్శించారు. గ్రామంలో పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం విధానాలు, సెగ్రిగేషన్ షెడ్ సందర్శించి కంపోస్టు తయారీ విధానం, తడి , పొడి చెత్త వేరు చేయు విధానంను క్షుణ్ణంగా పరిశీలించి గ్రామ పంచాయతీ సమకూర్చుకునే ఆదాయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే క్రీడా ప్రాంగణం సందర్శించి క్రీడలు, డంపింగ్ యార్డు వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం సందర్శించి మెడికల్ సిబ్బందితో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ దగ్గర ఉండి వివరించారు. అలాగే ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంను సందర్శించి పరిశీలించారు. అక్కడ వైద్య సేవల విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణ సేవలు, చిన్న పిల్లల వ్యాధుల నివారణ టీకాలు, టీబీ వ్యాధి నిర్మూలన, సీజనల్ వ్యాధులను అరికట్టే జాగ్రత్తలు గురించి తెలుసుకున్నారు. రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందుతున్న తీరును వాకబు చేశారు. గణపురం మండలం చెల్పూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని డాక్టర్లు , ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఉదయం గ్రామంలో తిరుగుతూ గ్రామ స్థితిగతులను పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వృత్తి, ఆదాయ వనరులు రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలతో ఉపయోగాలను గురించి తెలుసుకున్నారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రజల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డాక్టర్ సుశ్మితతో సమావేశమయ్యారు. అక్కడే ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి పిల్లలకు ఇచ్చే ఆహారాన్ని పరిశీలించారు. భూపాలపల్లి మండలంలోని గొర్లవేడు అంగన్‌వాడీ కేంద్రంతో పాటు హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అంగన్వాడీ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో క్షేత్ర స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో కొనసాగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల వివరాలను నిష్పక్షపాతంగా తెలపాలని అధికారులను కోరారు. అనంతరం హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ నెల 24వ తేదీ వరకు గొర్లవేడు గ్రామంలో ఉండి ఇంటింటికీ తిరుగుతూ పలు అంశాలపై, పథకాల అమలు, ప్రజల జీవన విధానం పై అధ్యయనం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా మండలాల్లో పర్యటించిన వారిలో ఏఎస్‌వోలు హిమాన్ష్ నిషాన్ సింగ్, నీరజ్ కుమార్, వివేక్‌కుమార్, పాయల్, మేఘా భారతి, రిషి రాజ్, పూజా సింగ్, శివం కందేల్వాల్, జై ప్రకాశ్ ఉన్నారు. వారి వెంట గంగారం డాక్టర్ సుమన్, ఏఎన్‌ఎం రజనీ, కార్యదర్శి కరుణాకర్, ఏపీవో వెంకన్న, ఆశ కార్యకర్తలు రజిత, కవిత, కాంత, చెల్పూరు జీపీ కార్యదర్శి హరిచంద్రారెడ్డి, ముక్కెర హేమంత్, కాళేశ్వరం కార్యదర్శి సత్యనారయణ, కారోబార్ సాయి గొర్లవేడు గ్రామ కార్యదర్శి కల్పన ఉన్నారు.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పలిమెల, మే 21 : మండలంలోని నీలంపల్లి సింహగిరి గుట్టపై లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంప్రదాయాలతో జరిగే కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్లు, తాగునీరు, అన్నదాన కార్యక్రమాలను అలయ కమిటీ ఏర్పాటు చేసింది. కల్యాణ మహోత్సవానికి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలోని పలు జిల్లాల భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించారు. కాగా, లక్ష్మీ నరసింహస్వామి కల్యాణానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్ అయిన పెద్ది సంతోష్‌కుమార్, తండ్రి: కీ.శే.లు పెద్ది నాగేశ్వరరావు, వృత్తి: వ్యాపారం, వయస్సు: 49 సం॥లు, నివాసం: ఇ.నెం. 12-7-59, ఎస్.వి.ఎన్. రోడ్, వరంగల్ డిస్ట్రిక్ట్ గారు శ్రీ మార్త కిశోర్‌కుమార్, తండ్రి: సాంబయ్య, వృత్తి: వ్యాపారం, వయస్సు: 36 సం॥లు, నివాసం: ఇ.నెం. 10-35, రాఘవపట్నం, వరంగల్ గారికి వరంగల్ పట్టణములోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏనుమాములలో గల సర్వే నెం. 79/B1 మరియు 79/B2 లో 1524.00 చ.గ.లు గల ఖాళీ స్థలము కలదు. ఇట్టిభూమిని నా క్లయింట్ పెద్దిసంతోష్‌కుమార్, తండ్రి: కీ.శే.లు పెద్ది నాగేశ్వర రావు, వృత్తి: వ్యాపారం, వయస్సు: 49 సం॥లు, నివాసం: ఇ.నెం. 12-7-59, ఎస్.వి.ఎన్. రోడ్డు, వరంగల్ డిస్ట్రిక్ట్ గారు విక్రయ దస్తావేజు ఏర్పర్చుకోనైనది. కావున పైన తెలుపబడినటువంటి ఆస్తిపైన ఎవరికైన ఎలాంటి అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ ఉన్నచో ఈ దిగువ తెలిపిన అడ్రస్‌కు ఏడు (7) రోజులలోగా తెలుపగలరు. ఎలాంటి అభ్యంతరములు, ఆక్షేపణలు రానిచో నా క్లయింట్ తన పేరు మీద కానీ వారి నామినీ పేరు మీద కానీ రిజిస్ట్రేషన్ చేసుకొనగలరు. తరువాత వచ్చు అభ్యంతరములు చెల్లనేరవు.

షెడ్యూలు ఆస్తి: వరంగల్ పట్టణములోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏనుమాములలో గల సర్వే నెం. 79/B1 మరియు 79/B2 లో 1524.00 చ.గ.లు గల ఖాళీ స్థలము ఈ క్రింది దిగువ తెలిపిన హద్దులలో ఉన్నది. తూర్పు: 15 ఫీట్ల బండ్ల బాట, పడమర: ఎన్. కొండయ్య గారి ఖాళీ స్థలము, ఉత్తరం: కోరె సమ్మయ్య మరియు గట్టుకారి రాజేందర్ గార్ల ఖాళీ స్థలము, దక్షిణం: కానుగంటి భాస్కర్ గారి ఖాళీ స్థలము.

తేది. 21-05-2024
ఇట్లు: **కొమురవెల్లి కాశీనాథ్** అడ్వకేట్, ఇ.నెం. 12-7-40, రామన్నపేట, వరంగల్.
Cell: 9885243704

## ఇసుక తరలిస్తున్న లారీల పట్టివేత

కాటారం, మే 21 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మండలంలోని గంగారం క్రాస్ రోడ్డు వద్ద లారీలను పట్టుకున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. పోలీసుల తనిఖీలను చూసి ఒక లారీ డ్రైవర్ పారిపోగా, మరో లారీ డ్రైవర్ అనుమతి పత్రాలు చూపించలేదన్నారు. సదరు డ్రైవర్‌ను విచారించగా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన గంధమల్ల మధు అని, తన యజమాని హైదరాబాద్‌కు చెందిన ఎం గోవర్ధన్‌గా చెప్పాడని తెలిపారు. అన్నారం క్వారీ నుంచి ఇసుకను తరలిస్తున్నానని చెప్పడంతో లారీ డ్రైవర్, యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# మల్లూరులో ఘనంగా ధ్వజారోహణ


ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మంగపేట, మే 21 : మల్లూరు దేవస్థాన ప్ర ధాన అర్చకులు కైంకర్యం రాఘవాచార్యులు, ముక్కామల రాజశేఖరశర్మ, ఇన్‌చార్జి ఈవో మహేశ్, భద్రాచలం ఆలయ వేద పండితులు అమరవాది మురళీ కృష్ణమాచార్యుల బృందం ఆధ్వర్యంలో మంగళవారం ధ్వజారోహణ క్రతువు నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి సంబంధించి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పంపేందుకే ఈ ధ్వజారోహణ ప్రక్రియ జరుపుతారని అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు శాస్త్రోకంగా నిర్వహించారు. భక్తులకు గరుడ ప్రసాదాన్ని అందజేశారు. నేడు (బుధవారం) లక్ష్మీనర్సింహస్వామి ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఉత్సవాల్లో ఆలయ అర్చక, సిబ్బంది పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చందుశర్మ, వెంకటనారాయణశర్మ, మురళీ శర్మ, సీతారాములు, సుధీర్ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఉదయం హనుమకొండ నుంచి ఏటూరునాగారం వరకు బస్సు నడుసుందని, ఏటూరునాగారం నుంచి రోజంతా ఎనిమిది ట్రిప్పులు మల్లూరు గుట్టకు భక్తులను చేరవేస్తుందని ఆర్టీసీ కంట్రోలర్ శంకర్ తెలిపారు. చలువ పందిళ్లు, వెహికిల్ పార్కింగ్ స్థలం, తాగు నీరు, వైద్య, మరుగు దొడ్ల సదుపాయాలను ఈవో మహేశ్‌తో కలిసి మండల ప్రత్యేక అధికారి తుల రవి, తహసీల్దార్ వీరస్వామి బృందం పరిశీలించింది. వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్ పరిశీలించి మందులు పంపిణీ చేశారు. ఏర్పాట్ల పరిశీలనలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో మమత, ఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, మల్లూరు ఆలయాన్ని ఏటూరునాగారం ఏఎస్పీ మహేశ్ గీతే బాబా సాహెబ్ సందర్శించారు. పార్కింగ్ స్థలంతో పాటు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట సీఐ రాజు, ఎస్సై రవికుమార్ ఉన్నారు.

## ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

వాజేడు, మే 21 : ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, విద్యా వలంటీర్లను తీసుకోవాలని ఏటీఏ (ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్) మండల అధ్యక్షుడు ఇర్ప బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లో విద్యా వ్యవస్థ పర్యవేక్షణ సాధారణ ఉపాధ్యాయుడు ఒక్కరే చేయడం కష్ట సాధ్యంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు బోదెబోయిన సురేశ్, హనుమంతు, సంతోష్ పాల్గొన్నారు.

## గడ్డి మందు తాగి యువకుడి మృతి

కన్నాయిగూడెం, మే 21 : మండలంలోని సింగారానికి చెందిన గడ్డం మనోజ్ (26) గడ్డి మందు తాగి మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం.. బీటెక్ పూర్తి చేసిన మనోజ్ ఇంటికి వచ్చిన ఏడాదికి మతిస్థిమితం కోల్పోయాడు. పలు దవాఖానలకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. కాగా, పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు.


రామకృష్ణాపూర్(టీ)లో చెత్తను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

# చెత్తను తొలగించిన జీపీ సిబ్బంది

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**

టేకుమట్ల, మే 21 : మండలంలోని రామకృష్ణాపూర్(టీ)లో పేరుకుపోయిన చెత్తను గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. పది రోజుల నుంచి చెత్తను తీయకపోవడంతో దుర్వాసన వస్తున్న నేపథ్యంలో 'చెత్త తీయించండి సారూ' శీర్షికన మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించినందుకు ఆ గ్రామ యువకులు హర్షం వ్యక్తం చేస్తూ 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రంజిత్‌కుమార్, ఏవో సంతోష్

ములుగు రూరల్, మే 21 : విత్తన డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ మేకల రంజిత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి మునుకుంట్ల సంతోష్, సీఐ తనిఖీ చేశారు. డీలర్లు రైతులు అడిగిన విత్తనాలనే అందించాలన్నారు. రైతులు తప్పని సరిగా బిల్లు పొందాలని సూచించారు. నకిలీ విత్తనాల విక్రయాలు జరిగినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వారివెంట ఏడీఏతో పాటు ఎస్సై లక్ష్మారెడ్డి ఉన్నారు.

## హనుమాన్ ఆలయానికి విరాళం


చెక్కు అందజేస్తున్న లిల్లేశ్

కాళేశ్వరం, మే 21 : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని హనుమాన్ ఆలయానికి కాటారం దక్కన్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గుండెల్లి లిల్లేశ్ విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సాయంగా రూ. 50 వేల చెక్కును మంగళవారం అర్చకుడు మాడుగుల బాపుశర్మకు ఇచ్చారు. అలాగే ఆలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది భక్తులు హనుమాన్ మాలలు ధరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

**WANTED**

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

**CHANGE OF NAME**

G. RADHA D/o G. BHADRAIAH (Old Name) my name changed as VELAGANDULA RADHIKA W/o LATE V. SRIDHAR (Updation Aadhar and DOB: 12-12-1982) D/o G. Bhadraiah (New Name). R/o H.No. 4-5-2, Kothur Road, Hanamkonda Dist. TS.

**CHANGE OF NAME**

★I, PARAMKUSHAM VYSHNAVI (New Name), Previously called CHATHARAJU VYSHNAVI (Old Name) and R/o H.No. 15-7-191, Ramannapet, Warangal Mandal, Warangal District-506 002. Telangana.State., India and Solemnly Declare.
NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565